ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి 3 ములుగు

మంగళవారం 12 మార్చి 2024

మోడికుంటకు మోక్షమెప్పుడో?

- 2005 నుంచి పెండింగ్‌లోనే పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా..
- గతేడాది డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం
- మంత్రులు దృష్టి సారించాలంటున్న మన్యం ప్రజలు



మోడికుంట ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం (ఫైల్)

వాజేడు, మార్చి 11: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మోడికుంట ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందా.. అని మన్యం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని కృష్ణాపురం వద్ద నిర్మించనున్న మోడికుంట ప్రాజెక్టు రెండున్నర దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగినప్పటికి పనులు మాత్రం మొదలు కాలేదు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుమతులు మంజూరు చేశారు.

ఆది నుంచి అడ్డంకులే..

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణానికి 2005లో అనుమతులు వచ్చినప్పటికి పనులు మొదలు కాలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండటంతో అటవీశాఖ మోకాలడ్డు వేసింది. అటవీశాఖ భూములు కోల్పోతుండటంతో అనుమతులు ఇవ్వలేదు. ఆ భూముల స్థానంలో రెవెన్యూ భూములను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటవీశాఖకు కేటాయించడంతో అటవీశాఖ తొలి దశ అనుమతులు 2008లో వచ్చాయి. నాటి నుంచి రెండో దశ అనుమతులు రావాల్సి ఉండగా ప్రస్తుతం అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.60 కోట్లను చెల్లించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మొదటి నుంచి అటవీశాఖ అడ్డంకులు సృష్టించడంతో ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రాజెక్టు పనులను దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ పనులను మొదలు పెట్టేందుకు అన్ని చర్యల్ని చేపట్టింది. ఇసుక, ఇతర భారీ యంత్రాలను తరలించగా అటవీశాఖ అభ్యంతరంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. ఆ యంత్రాలు ప్రస్తుతం తుప్పుపట్టి పనికిరాని దశలో ఉన్నాయి. నాటి నుంచి తట్టెడు మట్టి కూడా తీయకుండా ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది.

2018లో ప్రజాభిప్రాయ సేకరణ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వాజేడు మండలాన్ని 2016లో మొదట భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం ములుగు జిల్లాలో కలిపారు. 2018లో భూపాలపల్లి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను ఏర్పాటు చేసి గిరిజనులు, గిరిజనేతరుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రాజెక్టు నిర్మాణంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో 2019లో పర్యావరణ అనుమతులు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి విడుదల చేయలేదు.

2023లో సీడబ్ల్యూసీ ఆమోదం

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి 2023లో మోడికుంట డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపినట్లు గోదావరి బోర్డు వెల్లడించింది. దీంతో అన్ని అనుమతులు వచ్చినప్పటికి పనులు మాత్రం పూర్తికాలేదు. 2005లో కాంట్రాక్టు పనులను దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ టెండర్లను రద్దు చేసే ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నిర్మాణంకు అడ్డంకులు ఏర్పడుతున్నట్లు సమాచారం. ఆ టెండర్లను రద్దు చేసిన అనంతరం ప్రభుత్వం కొత్త టెండర్లను ఆహ్వానించి ప్రాజెక్టు పనులు మొదలు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

పెరిగిన అంచనా వ్యయం

మోడికుంట వాగు ప్రాజెక్టు అంచనా వ్యయం ఏళ్లు గడుస్తున్న కొద్దీ పెరుగుతోంది. 2005లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.100 కోట్లు కాగా పనులు మొదలవలేదు. 2018లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.425.16 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం 2021-22 లెక్కల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.524 కోట్లుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

10వేల ఎకరాలకు సాగునీరు

ప్రాజెక్టు నిర్మాణం జరిగితే వాజేడు మండలంలోని 35 గ్రామాల్లో 10వేల ఎకరాలకు ఒకేసారి సాగునీరు ఇవ్వొచ్చని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యం 2.142 టీఎంసీలు. దీంతో ఖరీఫ్‌లో 10వేల ఎకరాలు, రబీలో సుమారు 5వేల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుతుండటంతో తాగునీటి ఇబ్బందులు కూడా ఉండవని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో వాజేడులో ఎక్కువగా వరి, మిర్చి పంటలకు పుష్కలంగా సాగునీరు అంది దిగుబడులు వచ్చే ఆస్కారం ఉంది. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఆదివాసీల జీవన విధానంలో మార్పులు వచ్చే ఆస్కారం ఉందని స్థానికులు వాపోతున్నారు.



ప్రాజెక్టు నిర్మించే ప్రదేశంలో నాటి కంపెనీ ఏర్పాటు చేసుకున్న క్రషర్ (ఫైల్)

మంత్రులు దృష్టి సారించాలి

భద్రాచలం నియోజకవర్గంలోని వాజేడు మండలం ప్రస్తుతం ములుగు జిల్లాలో ఉంది. జిల్లాల మార్పుతో వాజేడు మండల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు అంతగా దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో సైతం మోడికుంట ప్రాజెక్టును పక్కకు పెట్టగా ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ మైనా ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాజేడు మండలానికి ప్రత్యేక స్థానం ఉండేది. ప్రస్తుతం ములుగు జిల్లాలో వీలినం అయ్యాక ఈ జిల్లా నాయకులు పెద్దగా పట్టించుకోక పోవడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులుగా కొనసాగుతుండగా ములుగు జిల్లాకు చెందిన సీతక్క సైతం మంత్రిగా ఉండటంతో ప్రాజెక్టు నిర్మాణంపై మరలా ఆశలు చిగురిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టు పనులపై మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పనులు మొదలయ్యే విధంగా ఒత్తిడి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తుప్పు పట్టిన వాహనం (ఫైల్)

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



పంబాపూర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, మార్చి 11 : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని కాటాపూర్, బీరెల్లి, వీరాపూర్, రంగాపూర్, పంబాపూర్ గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత తాడ్వాయి మండల కేంద్రంలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా కాటాపూర్‌లో మసీద్ ప్రహరీ, సీసీరోడ్లు, బీరెల్లి, రంగాపూర్‌లో సీసీరోడ్ల నిర్మాణాన్ని, వీరాపూర్‌లో బోర్‌వెల్‌ను ప్రారంభించారు. కాటాపూర్, గంగారం, పంబాపూర్, బీరెల్లి, రంగాపూర్ తదితర గ్రామాల్లో ప్రజలు మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికారు. గౌడ కులస్థుల ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం కాటాపూర్‌లో పలువురు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. పంబాపూర్‌లోని శివాలయంలో మంత్రి పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అందు బాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నామని, మిగతా వాటిని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు ముజాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మార్చి 11 : వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆమె పాల్గొని ప్రజల నుంచి 21 దరఖాస్తులను స్వీకరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా మండల ప్రత్యేక అధికారులు కేటాయించిన మండలంలో పర్యటించాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా ముందస్తు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, సీపీవో ప్రకాష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, కార్మిక శాఖ అధికారి వినోద, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఈపీ.ప్రేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓసీ-3 నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

నగరంపల్లి వాసులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూ నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్

గణపురం, మార్చి 11 : భూపాలపల్లి సింగరేణి ఓపెన్‌కాస్ట్-3 ప్రాజెక్టు ఏర్పాటులో భూములు కోల్పోయిన నగరంపల్లి భూ నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని రామప్పకాలనీలో ఓసీ-3 నిర్వాసితులకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ భవేశ్‌మిశ్రాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 84 మంది లబ్ధిదారులకు చెల్పూరు శివారులోని 134 సర్వే నెంబర్‌లో 200 చదరపు గజాల ఇంటి స్థలం పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఇళ్లు నిర్మించుకోవాలని, ఒకవేళ ఇళ్లు నిర్మించుకోలేని పేద వారు ఉంటే ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు.

కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అవుతున్న నగరంపల్లి వాసులకు అతి చేరువలో మెడికల్ కళాశాల, ఆయుష్ ఆస్పత్రి, క్రిటికల్ కేర్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్, వరంగల్‌లో లభించే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. అంతేకాకుండా ఓసీ- 3 విస్తరణకు ఇంటి స్థలాలు అప్పగించిన వారికి పట్టాలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో 250 దరఖాస్తులు రాగా గ్రామ సభలు నిర్వహించి అర్హులను మాత్రమే గుర్తించడం జరిగిందన్నారు. ఇచ్చిన స్థలాల్లో వెంటనే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించి భూమి అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీవో భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు చోటేమియా, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మెగా జాబ్‌మేళాలో కలెక్టర్ భవేష్‌మిశ్రా



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

కాటారం, మార్చి 11 : యువత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల ద్వారా కల్పించబడుతున్న అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో రాణించాలని జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. స్థానికంగానే కాకుండా ఎక్కడికైనా వెళ్లి ఉద్యోగం చేసేలా మానసికంగా సిద్ధం కావాలని ఉద్బోటించారు. కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో రాష్ట్ర యువజన సర్వీసులు అభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 60కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మెగా జాబ్‌మేళాను కలెక్టర్ భవేష్‌మిశ్రా ఎస్పీ కిరణ్‌ఖరే, యూత్ సర్వీసెస్ స్టేట్ మేనేజర్ మన్మోహన్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచమే గ్లోబల్ విలేజ్‌గా మారిన తరుణంలో స్థానికంగానే ఉపాధి, ఉద్యోగావకాశాలు కావాలనుకోవడం సరికాదన్నారు.

జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ గతంలో జిల్లా వెనుకబడిన ప్రాంతమని, ప్రస్తుతం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. యువత ఏదో పని చేసుకుంటూ జీవితంలో పైకెదగడానికి కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కాటారం డివిజన్ గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమని.. ప్రస్తుతం అభివృద్ధి దిశగా సాగుతున్నదని తెలిపారు. యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ యువతీ యువకులు తమ విద్యార్హతలను బట్టి అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ఉన్న ఊరిలోనే ఉద్యోగం, ఉపాధి కావాలంటే సాధ్యమయ్యే పనికాదని, ఎక్కడైనా పనిచేసి తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలన్నారు.

యూత్ సర్వీసెస్ స్టేట్ మేనేజర్ మన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. మేళాలో 1,560 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇందులో ఇంటర్వ్యూల అనంతరం 231 మందికి ఆయా కంపెనీల ప్రతినిధులు వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందించాయన్నారు. 460 మందిని షార్ట్ లిస్ట్ చేసి ఆయా కంపెనీలకు హాజరు కావాలని కోరారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఎంపీటీసీ మహేశ్వరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు నవీన్‌రావు, అంగజాల అశోక్, విక్రమ్, మొగిలి, ప్రభాకర్, శ్రీహరి, రాజబాపు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- నిష్పక్షపాతంగా సకాలంలో పరిష్కరించాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శబరీశ్



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, మార్చి 11 : జిల్లాలో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు నిష్పక్షపాతంగా సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం జరగగా ఆయన ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి పాల్గొన్నారు. క్రిమినల్, కోర్టు పెండింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఆస్తికి సంబంధించిన నేరాలను పోలీస్‌స్టేషన్ వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణ, నాణ్యత, నేరారోపణ రేటును మెరుగుపరచడానికి విచారణను సరైన పద్ధతిలో చేపట్టి బాధితులకు అండగా నిలవాలన్నారు. విచారణలో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని, తద్వారా ప్రజలకు సకాలంలో న్యాయం అందించబడుతుందని అన్నారు. దర్యాప్తు అధికారులు నేర విచారణలో నాణ్యతను మెరుగుపరచుకోవాలని, ప్రాపర్టీ రికవరీ కేసులలో పురోగతి దిశగా పనిచేయాలన్నారు. పోక్సో కేసులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. పంట పొలాలు, అడవుల్లో కరెంటు వైర్లు అమర్చి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారిని గుర్తించి కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలన్నారు. కేసుల నమోదు, పరిష్కారంలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు సీఐ రంజిత్‌కుమార్, పస్రా సీఐ శంకర్, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు రాజు, బండారి కుమార్, ఆర్ఐ అడ్మిన్ సతీష్, ఆర్ఐ ఆపరేషన్ సంతోష్, ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌తో పాటు జిల్లాలోని ఎస్సైలు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

నర్సింగపూర్‌లో ఘటన




పెద్ది కృష్ణప్రసాద్ (ఫైల్)

తాడ్వాయి, మార్చి 11: పాఠశాల డ్రిల్లు పీరియడ్‌లో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఓ బాలుడు బావిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన తాడ్వాయి మండలంలోని ఇందిరానగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఏటూరునాగారం మండలం రొయ్యూరు(శంకరాజుపల్లి)కు చెందిన పెద్ది కేశవులు-దేవి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఏటూరునాగారం ఆశ్రమ పాఠశాలలో చదువుతుంది. కుమారుడు పెద్ది కృష్ణప్రసాద్(13) ఈ ఏడాది తాడ్వాయి మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణపరిషత్ వసతి గృహంలో చేరి ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే సోమవారం సాయంత్రం ఆటల పీరియడ్ బెల్లు కొట్టడంతో విద్యార్థులందరూ ఆట స్థలానికి వెళ్లారు. దీంతో వసతి గృహం విద్యార్థులు ఇద్దరు, ఇందిరానగర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కలిసి ఎవరికీ చెప్పకుండా సమీపంలో గల నర్సింగపూర్‌లోని కాంభోజరాజు చెరువు కట్ట కింద గల బావిలో ఈతకు వెళ్లారు. ముగ్గురు విద్యార్థులు బావిలో దూకగా ఒకరు ఒడ్డుమీద ఉన్నాడు. దూకిన వారిలో ఒకరు ఒడ్డుపైకి చేరగా ఒడ్డున ఉన్న కృష్ణప్రసాద్ అకస్మాత్తుగా బావిలో దూకి మునిగిపోయాడు. తోటివారు గమనించి ఒడ్డుకు చేరుకుని కేకలు వేశారు. సమీపంలో ఉన్న రైతులు గమనించి బావి వద్దకు చేరుకుని పరిశీలించగా కృష్ణప్రసాద్ పైకి తేలలేదు. తోటి విద్యార్థులు పరిగెత్తి ఉపాధ్యాయులకు, వనవాసీ కళ్యాణపరిషత్ వసతిగృహం వార్డెన్‌కు సమాచారం అందించారు. కాగా, రాత్రి 7.30 గంటలకు పోలీసుల సహాయంతో ఈతగాళ్లు బావిలో వెదికి బాలుడి మృతదేహాన్ని బయటికి తీశారు. సంఘటనా స్థలికి తల్లిదండ్రులు చేరుకుని బోరున విలపించారు. కాగా, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టికెట్ టెన్షన్!

- వరంగల్ అభ్యర్థిత్వాలపై తేల్చని ప్రధాన పార్టీలు
- ఒకటిరెండు రోజుల్లో జాబితాలు వెలువడే అవకాశం
- కాంగ్రెస్‌లో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ
- బీఆర్ఎస్ నుంచి అరూరి లేదా కావ్యకు అవకాశం
- బీజేపీలో ఆవిరైన జంపింగ్ ఆశలు



వరంగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. అయితే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరో తేల్చలేక ప్రధాన పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మహబూబాబాద్ అభ్యర్థులను తేల్చిన ప్రధాన పార్టీలు.. వరంగల్ అభ్యర్థిని ఎంపిక చేయటంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దీంతో అన్ని పార్టీల్లోనూ టికెట్ టెన్షన్ కనిపిస్తోంది. ఇక కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్ కోసం ఆశావహులు ఢిల్లీ, హైదరాబాద్‌ల్లోని తమ పార్టీ పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధినాయకత్వం బలమైన అభ్యర్థి కోసం సర్వే చేయిస్తుండగా.. జంపింగ్‌లపై ఆశలు పెట్టుకున్న బీజేపీకి నిరాశే మిగిలింది. ఇక బీఆర్ఎస్‌లో తమకే టికెట్ ఇవ్వాలని ఉద్యమకారులు పట్టుపడుతుండగా, మరో ఇద్దరు కీలక నేతలు కూడా టికెట్ ఆశిస్తున్నారు. దీంతో వరంగల్ టికెట్ ఏ పార్టీలో ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ అన్ని పార్టీల్లోనూ నెలకొంది. అయితే త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఒకటిరెండు రోజుల్లో అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

పార్టీలకు సవాల్‌గా..

వరంగల్ సీటు తమదే అని అన్ని పార్టీల్లోని ఆశావహులు ధీమాతో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సీట్లలో ఆరు చోట్ల కాంగ్రెస్ గెలిచింది. అయితే ఓటింగ్ పరంగా బీఆర్ఎస్, బీజేపీలు బలంగా ఉండటంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు అంత సులభం కాదని తెలుస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ విజయం సాధించగా, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, పాలకుర్తిలో బీఆర్ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. వరంగల్ తూర్పులో బీజేపీ ద్వితీయ స్థానంలో ఉండగా, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట అసెం బ్లీ నియోజకవర్గాల్లో అంచనాలకు మించి బీజేపీ ఓట్లను పొందింది. దీంతోపాటు లోక్‌సభ ఎన్నికలు కావడంతో ఓటరు నాడి కూడా మారుతుందనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ బరిలో బలమైన అభ్యర్థులను నిలిపితేనే విజయం సాధ్యమనే లెక్కల్లో ప్రధాన పార్టీలున్నాయి.

కాంగ్రెస్‌లో టెన్షన్.. టెన్షన్..

కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42మంది దరఖాస్తు చేసుకోగా, మరో డజను మంది దరఖాస్తు చేసుకోనప్పటికీ టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వరంగల్ ఎంపీ టికెట్ విషయంలో పరకాలకు చెందిన దొమ్మాటి సాంబయ్య పేరు దాదాపు ఖరారైందనే ప్రచారం జరిగింది. తొలి జాబితాలో సాంబయ్య పేరు లేకపోవటంతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయనే ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ఓ మంత్రి తాను సూచించిన వ్యక్తికే టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టికెట్ ఆశిస్తున్న దొమ్మాటి సాంబయ్యతో పాటు శనిగపురం ఇందిర, రాగమళ్ల పరమేశ్వర్, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌తో పాటు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు సీనియర్ కాంగ్రెస్ నేతలతోపాటు ఓ సీనియర్ జర్నలిస్టు పేర్లపై కాంగ్రెస్ ప్లాష్ సర్వే జరుపుతున్నట్లుగా సమాచారం. ఈ సర్వే ఆధారంగా ఎంపీ టికెట్ కేటాయించే అవకాశం ఉందనే

మిగతా 6వ పేజీలో...

గువ్వలేని పాటల గూడు

నేడు రచయిత కందికొండ యాదగిరి వర్ధంతి



హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గీత రచయిత, కవి, కథకుడు కందికొండ యాదగిరి తెలుగు సినీ ప్రపంచానికి దూరమై అప్పుడే రెండేళ్లవుతోంది. ఆయన మృతితో గువ్వలేని పాట గూడు చిన్నబోయింది. పాటల ప్రపంచం మూగవోయింది. కథలు, కవిత్వాలతో తేజరిల్లిన సాహితీ లోకం నిస్తేజంగా మారింది. 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో 1300లకుపైగా పాటలు రాసిన కందికొండ లేని లోటు ఇప్పటికీ పూడ్చలేదు. పుట్టిపెరిగిన నాగుర్లపల్లి.. యాదగిరి నిష్క్రమణ విషాదం నుంచి ఇంకా తేరుకోలేదు, మిత్రుల గుండెల్లో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ పచ్చిగానే ఉన్నాయి. ఈనెల 12న కందికొండ యాదగిరి వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన యాదిలో..

నాగర్లపల్లి వాసి..

కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ప్రాథమిక విద్య సొంతూరులోనే పూర్తి చేశాడు. డిగ్రీ వరకు మహబూబాబాద్‌లో చదుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎంఏ, పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చేశారు. కందికొండ తాను చదువుకునే రోజుల నుంచే పాటు రాయడం ప్రారంభించారు. తాను రాసిన పాటలు, కవితను తోటి విద్యార్థులతో పంచుకునేవారు. విద్యార్థి దశలో పాటతోటలో విహరించడం మొదలుపెట్టారు. అలా పాటే ఆయన ప్రాణమైంది. తర్వాత పాటతోనే జీవన ప్రయాణం సాగింది. అలా పల్లెలో పల్లవించిన కందికొండ పాట పరిమళం మెల్లిగా ఎల్లెడలా వ్యాపించింది.

క్యాన్సర్‌తో పోరాడి..


క్యాన్సర్ మహమ్మారి 49 ఏళ్ల వయసులోనే కందికొండను కబళించింది. 2022 మార్చి 12న హైదరాబాద్‌లోని తన నివాసంలో మరణించాడు. 2012లో ఆయనకు తొలిసారిగా క్యాన్సర్ నిర్ధారణ అయింది. అప్పట్లోనే సర్జరీ చేయించుకున్నారు. క్యాన్సర్‌ను జయించానుకున్నాడు. కానీ 2019లో అది మళ్లీ తిరగబెట్టడంతో చికిత్సలో భాగంగా చేసిన కీమోథెరపీ, రేడియేషన్ ప్రభావం వల్ల వెన్నెముక దెబ్బతిన్నది. అప్పటి నుంచి కందికొండ పూర్తిగా మంచానికే పరిమితమయ్యారు. కందికొండకు భార్య రమాదేవి, కుమార్తె మాతృక, కుమారుడు ప్రభంజన్ ఉన్నారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్


రంజాన్‌కు ముస్తాబైన మక్కా మసీద్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్.! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.


జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్ కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్...
మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల, మార్చి 11: మండలంలోని కాల్వపల్లి శివారు మానేరు వాగు, నవాబుపేట శివారు చలివాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా జడల్‌పేట క్రాస్ వద్ద ఇసుక ట్రాకర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు పప్పు శ్రీను, బర్ల రవీందర్, అంకం రాజేందర్, సీటూరే లింగారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో సిబ్బంది యాకయ్య, సురేందర్, నవీన్, అస్లాం, లింగన్న పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని కార్మికుల వినతి

వెంకటాపురం(నూగూరు), మార్చి 11 : మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహచారి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వారికి వేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని కార్మికులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న రాష్ట్ర కన్వీనర్ వీరయ్య

వెంకటాపురం(నూగూరు), మార్చి 11: ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆదివాసీ విద్యార్థులకు కోయ భాష పుస్తకాలు అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, నాయకులు రేగ గణేష్, ప్రతాప్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ వేయాలి

ఐటీడీఏ ఎదుట తుడుందెబ్బ, ఏటీఎఫ్ నేతల ధర్నా

ఏటూరునాగారం రూరల్, మార్చి 11 : ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి ఉపాధ్యాయ ఉద్యోగాలు చేపట్టాలని కోరుతూ తుడుందెబ్బ, ఏటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు పులిసె బాలకృష్ణ, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట బైఠాయించి స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 10ఏళ్లలో ప్రభుత్వాలు ఒక్క స్పెషల్ డీఎస్సీ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై గిరిజనులు గంపెడాశలు పెట్టుకున్నారని తెలిపారు. జీవో 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ విద్యను బలపేతం చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఆయా పాఠశాలల్లో స్పెషల్ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు ప్రకటించి గిరిజన విద్యను పటిష్ఠ పరచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పోడెం బాబు, అర్రెంనారాయణ, పారె జానకిరావు, కోర్నిబెల్లి గణేష్, వేణు, అరవింద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రా



దర్బార్‌లో పీవో చిత్రామిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, మార్చి 11: ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి మెరుగైన సేవలందించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో పీవో గిరిజనుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 16 మంది తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. గత కొంతకాలంగా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగం చేస్తున్నానని, అట్టి పోస్టును రెగ్యులైజేషన్ చేయాలని మహబూబాబాద్ జిల్లా కోమట్లగూడెంకు చెందిన విద్యాసాగర్, రాజు పీవోను వేడుకున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో గిరిజనుల భూముల్లో మోటార్లు వేశారని, అట్టి వాటికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ములుగు తుడుందెబ్బ నాయకుడు పోడెం శోభన్‌పీవోకు వినతి పత్రం అందించారు.

గిరి వికాసం పథకం ద్వారా గిరిజన భూముల్లో బోర్లు వేయాలని వెంకటాపురం(నూగూరు) మండలం బర్లగూడెం రైతులు దరఖాస్తు చేసుకొని సంవత్సరం గడుస్తున్నా బోర్లు వేయడం లేదని, వెంటనే గిరిజన భూముల్లో బోర్లు వేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర నాయకుడు కొర్స నరసింహమూర్తి పీవోకు విన్నవించారు. ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ములుగు మండలం కన్నయ్యగూడెంకు చెందిన స్వరూప పీవోకు వినతి పత్రం అందించారు. పీసా కోఆర్డినేటర్ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు పులిసె బాలకృష్ణ పీవోను కోరారు. అలాగే జీవనోపాధికి టిఫిన్ సెంటర్ ఏర్పాటుకు ఐటీ డీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని గోవిందరావుపేట మండలం బాలాజీనగర్‌కు చెందిన భూక్య స్వామి పీవోకు విన్నవించారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఈఈ హేమలత, ఏవో దామోదరస్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16వ తేదీన భూపాలపల్లిలోని కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రీ లిటిగేషన్స్, ఎలక్ట్రిసిటీ, మోటార్ యాక్సిడెంట్ కేసులు, ఇన్సూరెన్స్, కాంపౌండ్ క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మెయింటనెన్స్ కేసులు, ఫ్యామిలీ డిస్పూట్, బ్యాంకు లోన్ తగాదాలు ఇతరత్రా కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ప్రజావాణి వినతులపై స్పందించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 11 : ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి వినతులకు ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. దరఖాస్తుదారులకు తమ సమస్య పరిష్కారానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిహారం అందజేస్తాం : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 11: సింగరేణి ఓసీ-3లో భూములు కోల్పోయిన గణపురం మండలం కొండంపల్లి నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందజేస్తామని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ ఓసి-3 భూనిర్వాసితులకు అందించే పరిహారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ భూములకు, ఇండ్లకు వ్యవసాయ భూముల్లో ఉన్న నిర్మాణాలకు కూడా పరిహారం చెల్లించబడుతుందన్నారు. గ్రామంలో వ్యవసాయ భూములకు, ఇంటి స్థలాలకు ధరలు నిర్ణయించేందుకు చర్చా వేదిక నిర్వహిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే గ్రామసభల్లో అందించాలన్నారు. ప్యాకేజీతో పాటు భూనిర్వాసితులకు ఇంటి స్థలం మంజూరు చేస్తామన్నారు. వచ్చే 15 రోజుల్లో డిక్లరేషన్ చేస్తామని, ఇందుకు నిర్వాసితుల సహకారం అవసరమన్నారు. భూమికి తగ్గట్టు పరిహారం అందిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్ మురళీధర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో బిస్కెట్, లడ్డూ తయారీలో శిక్షణ

మహదేవపూర్, మార్చి 11 : నాబార్డు ద్వారా మహిళా సంఘాల్లోని మహిళలకు లడ్డూలు, బిస్కెట్ల తయారీ కోసం శిక్షణా కార్యక్రమాన్ని మహదేవపూర్‌లో సోమవారం ఝాన్సీ లక్ష్మీబాయి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలతో ఇలాంటి తినుబండారాలు తయారు చేయడంలో శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళలు ఆర్థికంగా లాభపడటంతో పాటు వినియోగదారులకు ఉపయోగపడుతుందన్నారు. వెలుగురేఖ నిర్వాహకులు రజిత, ట్రైనర్ దీప్తి, ఏపీఎం రవిందర్, వీపీవోలు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

కాకతీయఖని, మార్చి 11 : భూపాలపల్లి ఏరియాలోని నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్, కంప్యూటర్, డీటీపీ, ఆర్క్అండ్ గ్యాస్ వెల్డింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, కాస్మటాలజీ వంటి 38 రకాల కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 42 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువత ఈ నెల 15వ తేదీ లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌సీసీఎల్ ఎంఐఎస్‌ఈఎస్.సీవోఎం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నాక సంబంధిత కాపీలను ఏరియా జీవీటీసీలో సమర్పించాలని కోరారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

కాకతీయఖని, మార్చి 11 : ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వివరించాలంటూ సీపీఎం నాయకులు భూపాలపల్లిలోని కారల్‌మార్క్స్ కాలనీలో గల ఎస్‌బీఐ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సాయిలు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాలన్నారు. మోదీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి పార్లమెంటు ఎన్నికలు అయ్యే వరకు ఎలక్ట్రో బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐ నాన్చుతుందని ఆరోపించారు. బ్యాంకులు మోదీకి జేబు సంస్థ కాదని, అది పబ్లిక్ సంస్థ అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లారెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 11: ములుగు జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్‌గా గోవిందరావుపేట మండలంలోని చల్వాయి జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాటం మల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్‌గా పనిచేసిన బద్దం సుదర్శన్‌రెడ్డి ఇటీవల బదిలీ కాగా, ఆ స్థానంలో మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో శక్తివంచన లేకుండా పనిచేస్తూ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కాగా, మల్లారెడ్డికి డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సాంబయ్య, కోఆర్డినేటర్ రమాదేవి, గెజిటెడ్‌ప్రధానోపాధ్యాయుల సంఘంజిల్లాఅధ్యక్షుడు అనంతుల సురేందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీలో గోమాస శ్రీనివాస్ చేరిక



తరుణ్‌చుగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోమాస శ్రీనివాస్

కాటారం, మార్చి 11: మండలంలోని జాదరావుపేట గ్రామానికి చెందిన గోమాస శ్రీనివాస్ బీజేపీలో చేరారు. ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో గోమాస శ్రీనివాస్ పార్టీలో చేరారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోమాస శ్రీనివాస్ బీజేపీలో చేరి పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. 2009లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమిపాలయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీనివాస్ 2019లో కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ ఆశించినా రాలేదు. ఇటీవల బీఆర్‌ఎస్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలో చేరడం, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆశావహుల రేస్‌లో ముందుండటంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఎంపీ టికెట్ దక్కదనే ఉద్దేశ్యంతోనే శ్రీనివాస్ బీజేపీ వైపు వెళ్లినట్లు తెలుస్తోంది.

నష్టపరిహారం చెల్లించాలంటూ ఆందోళన



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఓసీ-2 ప్రాజెక్ట్ అధికారి వెంకట్రామిరెడ్డి

కాకతీయఖని, మార్చి 11: సింగరేణి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలంటూ భూపాలపల్లి ఏరియా ఓపెన్‌కాస్ట్-2 క్వారీ వద్ద ఆకుదారివాడ, ఫకీర్‌గడ్డ భూనిర్వాసితులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ తమ భూములను సింగరేణి అధికారులు తీసుకుని 5 సంవత్సరాలు అవుతున్నా ఇంకా నష్టపరిహారం చెల్లించలేదన్నారు. తమను వేరే చోటుకు తరలించక పోవడంతో బ్లాస్టింగ్ వలన ఏర్పడ్డ దుమ్ము, దూళితో రోగాల బారిన పడుతున్నామన్నారు. భూనిర్వాసితుల నిరసనతో సుమారు రెండు గంటల పాటు బొగ్గు ఉత్పత్తి పనులకు అంతరాయం ఏర్పడింది. దీంతో సింగరేణి అధికారులు వెంకట్రామిరెడ్డి, రవి, కుమారస్వామి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆందోళన విరమించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై సుధాకర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని జీఎం అందుబాటులో లేరని, వచ్చిన వెంటనే మీ సమస్యను చర్చిద్దామని భూనిర్వాసితులతో చెప్పడంతో విరమించారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు మనోజ్, మధుసూదన్, రాజయ్య, రాజమల్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 11 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం కొర్ర రాజు అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. గత 20 రోజులుగా రైతులు గిట్టుబాటు ధర చట్టం పార్లమెంట్‌లో చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధకాండ ప్రయోగిస్తుందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ దేశంలో వికసిత్ భారత్ పేరుతో 25 కోట్ల మంది ప్రజలను దారిద్ర్యం నుంచి పైకి తెచ్చామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, దానిని ఎవరూ నమ్మవద్దని అన్నారు. అనంతరం సీపీఎం పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎమ్డీ.గఫూర్‌పాషా, సభ్యులుగా కొర్ర రాజు, గుండెబోయిన రవిగౌడ్, గొల్లపల్లి యాకయ్య, కలువల రవీందర్, దేవేందర్, బత్తిని రాజు, ఆగబోయిన సాంబయ్య, రత్నం ప్రవీణ్, రూప్‌సింగ్ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, రాజేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లిటౌన్, మార్చి 11: ఇంటి పన్ను బకాయిలపై 90 శాతం రిబేటును సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ భూపాలపల్లి పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రిబేటు ద్వారా ఎంత ఉపశమనం ఉంటుందో వివరించారు. ఈ అవకాశం ఈ నెల 31 వరకు మాత్రమే ఉందని తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

మహదేవపూర్, మార్చి 11: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో మొత్తం 106 మందికి రూ.లక్షా16వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముగ్గురు నూతన ఎస్సైల నియామకం

భూపాలపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లాకు ముగ్గురు నూతన ఎస్సైలు నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి ఠాణా మొదటి ఎస్సైగా భూపాలపల్లి వీఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్న కె.పవన్‌కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఇదే ఠాణాలో రెండవ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.సంధ్యారాణిని వీఆర్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో డీఎస్‌బీలో పనిచేస్తున్న ఆకుల శ్రీనివాస్‌కు రెండవ ఎస్సైగా పోస్టింగ్ ఇచ్చారు. వీరితో పాటు రామగుండం కమిషనరేట్ పరిధిలోని మాదారం ఠాణాలో పనిచేస్తున్న బి.అశోక్‌ను మొగుళ్లపల్లి మండల ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సాయిబాబా ఆలయ కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం, మార్చి 11 : మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్యాల ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో పొల్లియా, సారయ్య, వంగూరి నాగేశ్వరరావులు పోటీలో ఉండగా ఓటింగ్ ద్వారా ఎన్నిక చేపట్టారు. ఓటింగ్‌లో పెండ్యాల ప్రభాకర్‌కు అత్యధిక ఓట్లు రావడంతో అధ్యక్షుడిగా ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బచ్చు సతీష్, ఉపాధ్యక్షుడిగా పర్వతాల కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా గంజి రమేష్, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్‌లను ఎనుకున్నారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షుడు, సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో సుదర్శన్‌శర్మ, మెరుగు సత్యం, జాస్తి శ్రీకాంత్, బచ్చు సత్యనారాయణ, చెన్న ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా సారంగపాణి

గోవిందరావుపేట, మార్చి 11: గోవిందరావుపేట మండల ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా మోడెం సారంగపాణి ఎన్నికయ్యారు. సోమవారం మండలకేంద్రంలో సీనియర్ పాత్రికేయులు ఆకుల యుగేందర్, నెక్కంటి సునీల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరగగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అంకం వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సామ బుచ్చిరెడ్డి, సహాయ కార్యదర్శిగా పగడాల వాసు, కోశాధికారిగా బత్తిని వెంకట్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ మండల పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు తుక్కాని ఎల్లారెడ్డి, నర్రా రఘువీర్, గుండెబోయిన అనిల్‌కుమార్, వేముల సతీష్, జన్నారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సర్వే చేశాకే మేడిగడ్డను పునరుద్ధరించాలి

సిరొంచా తహసీల్దార్‌కు 'మహా' రైతుల వినతి



సిరొంచా తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహారాష్ట్ర రైతులు

మహదేవపూర్ రూరల్, మార్చి 11: మేడిగడ్డ బ్యారేజీతో ముంపునకు గురవుతున్న ప్రాంతాలు, తమ భూములకు నష్టపరిహారం విషయాలపై పూర్తి స్థాయిలో రీసర్వే చేశాకే మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు చేపట్టాలంటూ మహారాష్ట్ర రైతులు మరోసారి ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచా తహసీల్దార్‌కు రైతులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమను ముప్పు తిప్పలు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, గత ప్రభుత్వం ముంపు భూములకు పరిహారం ఇవ్వకుండ ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తాము సుమారు మూడు నెలల పాటు ఆందోళనలు చేస్తే ప్రాథమికంగా అంచనవేసిన భూములకు నష్టపరిహారం అందించిందని, మిగతా భూములకు పరిహారం ఇవ్వకపోగా ముంపు సర్వే కూడా చేపట్టలేదని అన్నారు. అయితే గత ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో నిర్లక్ష్యం చేసిందని, ప్రజాప్రభుత్వం అని చెప్పుకొంటున్న ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాకే మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు ముందడుగు వేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర వైపు పంట భూములకు నష్టపరిహారం, ముంపు సర్వేపై స్పష్టత ఇవ్వకుండా బ్యారేజీని పునరుద్ధరిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో మేడిగడ్డ బ్యారేజీ కారణంగా ముంపునకు గురవుతున్న రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్!

(3వ పేజీ తరువాయి)

వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. శనిగరపు ఇందిర ఢిల్లీలోనే మకాం వేసి తనకే టికెట్ కేటాయించాలని, తమది తొలి నుంచి కాంగ్రెస్ కుటుంబం అని సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గేలను కలిసి పది పేజీలతో కూడిన ఓ విజ్ఞప్తి పత్రం అందించారు. సాంబయ్య, రాగమళ్ల పరమేశ్వర్ కూడా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తుండటంతో టికెట్ ఎవరికి వస్తుందనే ఉత్కంఠ కాంగ్రెస్‌లో నెలకొంది. మంగళవారం లేదా బుధవారం కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసే అవకాశం ఉండటంతో వరంగల్ అభయహస్తం ఎవరికి అనే చర్చ కాంగ్రెస్ కేడర్‌లో జరుగుతోంది.

బీజేపీ తేల్చేదెప్పుడో..?

బీజేపీ తొలుత తెలంగాణలో 9మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. కానీ, వరంగల్ ఎంపీ అభ్యర్థి ఖరారు చేయలేదు. ఇప్పటికే డజను మందికి పైగా బీజేపీ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే బీఆర్‌ఎస్ వరంగల్‌జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను బీజేపీలోకి చేర్చుకుని, ఆయననే బీజేపీ అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. అయితే బీజేపీలో చేరేందుకు ఆరూరి ముందుకు రాకపోవటంతో బీజేపీ అభ్యర్థి ఎవరు అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మాజీ డీఐజీ టి.కృష్ణప్రసాద్ తనకే టికెట్ వస్తుందనే ధీమాతో వరంగల్ పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌తోపాటు మరో అరడజను మంది బీజేపీ నేతలు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే చర్చ కాషాయ పార్టీలో జరుగుతోంది. బుధవారం బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశం కానున్న నేపథ్యంలో రెండో విడతలోనైనా వరంగల్ సీటుపై బీజేపీ తేల్చుతుందా లేక చివరి వరకు నాన్చుడేనా అనే చర్చ కమలదళంలో జరుగుతోంది.

గులాబీలో ఉద్యమ చిచ్చు

బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీని మార్చటం దాదాపు ఖాయమనే చర్చ జరుగుతోంది. అయితే టికెట్ ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే వరంగల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం.. తన కుమార్తె కడియం కావ్యను రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు ఇదే మంచి అవకాశంగా భావిస్తూ పావులు కదుపుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కావ్యకే ఇవ్వాలని అధిష్ఠానంపై కడియం ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అరూరి రమేష్‌కు ఎంపీ టికెట్ వస్తుందా? లేదా? అనే ఉత్కంఠ ఆయన అనుచరవర్గంలో నెలకొంది. అయితే ఎంపీ టికెట్ ఉద్యమకారులకే ఇవ్వాలని తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, బోడ డిన్నాలతో పాటు సిట్టింగ్ ఎంపీ పసునూటి దయాకర్ డిమాండ్ చేస్తున్నారు. దీంతో గులాబీ పార్టీలో ఉద్యమ సెగ పెరుగుతుండటంతో టికెట్ ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది.

మానుకోటలో పోటీకి రెడీ

వరంగల్ ఎంపీ అభ్యర్థుల కోసం కుస్తీ పడుతున్న పార్టీలు.. మానుకోటలో మాత్రం పోటీకి రెడీ అంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి బలరాంనాయక్ పేరును ఖరారు చేసింది. దీంతో బలరాంనాయక్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇక మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకు మరోసారి బీఆర్‌ఎస్ అధిష్ఠానం అవకాశం ఇవ్వటంతో రెండోసారి ఎంపీగా కవిత బరిలోకి దిగుతున్నారు. ఇక ఇటీవలే మాజీ సీతారాంనాయక్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో సీతారాంనాయక్‌కు బీజేపీ టికెట్ దాదాపుగా ఖరారైందనే చర్చ పార్టీలో జరుగుతోంది. దీంతో మానుకోటలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఇక పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు.

టేకు కలప నిల్వచేసిన వ్యక్తికి జరిమానా

రూ.55వేలు ఫీజు వసూలు చేసిన అటవీశాఖ అధికారులు

కాటారం, మార్చి 11: మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం కోసం ఉపయోగించే టేకు కలప సామగ్రిని అక్రమంగా నిల్వ చేసినందుకు అటవీశాఖ అధికారులు జరిమానా విధించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. అటవీశాఖ కాటారం ఇంచార్జి రేంజర్ కిరణ్‌కుమార్, ఎఫ్‌ఎస్‌వో అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బొమ్మ సమ్మిరెడ్డి ఇంట్లో అక్రమంగా టేకు కలప ఉందని డీఎఫ్‌వోకు వచ్చిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. అక్కడ టేకు దర్వాజలు, కిటికీలు వంటి గృహ నిర్మాణ సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. కాగా, ధన్వాడలో ఉన్న తన సొంత భూమిలో పెంచిన టేకు చెట్లను కట్ చేసుకుని మూడేళ్ల క్రితమే సీ ఫీజు కట్టినట్లు సమ్మిరెడ్డి అధికారులకు తెలిపారు. ఇటీవల గారెపల్లికి తెచ్చి దర్వాజలు, కిటికీలు చేయిస్తున్నట్లు వెల్లడించారు. చాలా కాలం గడవడం, అప్పటి సీ ఫీజు సరిపడా కట్టకపోవడంతో కలపను కొలతలు తీసి రూ.55వేలు జరిమానా విధించామని రేంజర్ తెలిపారు.